## క్లుప్తంగా

### పోషకాహారం తప్పనిసరి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న టీచర్ అరుణ

మొయినాబాద్: ఎదిగే పిల్లలు తప్పనిసరిగా పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని అగన్‌వాడీ టీచర్ అరుణ అన్నారు. సురంగల్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహారంపై పిల్లలకు, తల్లులకు అవగాహన కల్పించారు. పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వాటి ఉపయోగాలు, అందులో ఉండే పోషక విలుల గురించి అగన్‌వాడీ టీచర్ అరుణ వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అన్ని రకాల పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు.

### ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సురేశ్



నియామక పత్రం అందుకుంటున్న సురేశ్

కేశంపేట: ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీని షాద్‌నగర్‌లో గురువారం ఎంపిక చేశారు. ఈ కమిటీలో మండల పరిధిలోని కొనాయపలి గ్రామానికి చెందిన గ్యార సురేశ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్యార సురేశ్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండలంలో ఎమ్మార్పీఎస్‌ను విస్తరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

### జాకారం గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన జాకారం గ్రామస్తులు

కొందుర్గు: జాకారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరినట్లు మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు తెలిపారు. పార్టీలో చేరిన వారిని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, ఆంజనేయులు, సత్యం రెడ్డి, రవి, వెంకటయ్య గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

### 11నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల: ఈ నెల 11వ తేదీనుంచి 17వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం సీపీఐ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్లలోని అంబేడ్కర్‌భవన్‌లో ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుభాన్‌రెడ్డి, సత్యనారాయణ, మక్బుల్, శివ, గీత, రాములుగౌడ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌ఐ అభ్యర్థికి సన్మానం



మౌనికను అభినందిస్తున్న కాలనీ వాసులు

షాద్‌నగర్: ఇటీవల వెలుబడిన ఎస్‌ఐ పరీక్షా ఫలితాల్లో ఎంపికైన పట్టణంలోని సాయిబాబా కాలనీకి చెందిన మౌనికను గురువారం మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్‌రెడ్డి, కాలనీ వాసులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కిరణ్, ప్రతాప్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ ఇటీవల విడుదలైన పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎస్‌ఐ ఫలితాలలో సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం ప్రవీణ్‌కుమార్‌ను సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బాల్‌రాంలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

# ‘గృహలక్ష్మి’ వరించేనా..?

**గుట్టుగా జాబితా**

- ఎమ్మెల్యేల ఆదేశాలతో సిద్ధం చేస్తున్న స్థానిక నాయకులు
- అధికార పక్షాన్ని వ్యతిరేకించే వారిపేర్లు ప్రత్యేక లిస్టులో



షాబాద్: గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగానే ఉంటుందని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా తయారైంది. పథకం కింద లబ్ధి పొందేవారి పేర్లను అధికార పార్టీకి చెందిన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపిక చేసి గుట్టుగా జాబితా సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే వారికి రూ. 3లక్షలు సాయం చేయనున్నారు. నియోజకవర్గానికి 3వేల మందికి ఇండ్ల నిర్మాణానికి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.7,350 కోట్లు కేటాయించారు. రానున్నది ఎన్నికల సీజన్ కావడంతో లబ్ధి పొందేవారు అధికార పార్టీకి అండగా నిలిచేలా చూడాలని సంబంధిత నాయకులు వారికి సూచిస్తున్నారు. ఈ క్రమంలో గృహలక్ష్మి కింద తమకు అనుకూలంగా ఉండే వ్యక్తులనే ఎంపిక చేసి ఇంటి నిర్మాణానికి సాయం అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తుంది.

**జిల్లాలో 25 వేల దరఖాస్తులు..**

గ్రామంలో భౌగోళిక పరిస్థితులు, ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒక్కో గ్రామానికి లబ్ధిదారుల సంఖ్యను నిర్ణయించారు. ఒక్కో నాయకుడి ద్వారా 10నుంచి 20 మందికి లబ్ధి చేకూర్చాలని అంతే మొత్తంలో జాబితాను సిద్ధం చేయాలని ఆదేశాలు అందాయి. లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి ఎమ్మెల్యేల కార్యాలయాలకు పంపిస్తే వారికే గృహలక్ష్మి వరించే అవకాశం ఉంది. ఇప్పటికే లబ్ధి చేకూర్చాల్సిన వ్యక్తుల వివరాలతో కూడిన జాబితా అధికార పక్షం నాయకులు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలకు పంపించినట్లు తెలిసింది. గృహలక్ష్మి పథకం కింద జిల్లాలో దాదాపు 25 వేల దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటిపై మండల స్థాయి అధికారులు పరిశీలన సైతం జరిపారు. వాటిని పరిగణలోకి తీసుకోకుండానే అధికార పార్టీ నాయకులు అందించిన జాబితాల ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక జరుగనుందని ప్రచారం జరుగుతోంది. ఏ సంక్షేమ పథకం కింద అయినా లబ్ధి పొందేవారి పేర్లు గ్రామసభల్లో ప్రతిపాదించి ఎంపిక చేయాల్సి ఉంటుంది. గృహలక్ష్మికి సంబంధించి ఎలాంటి గ్రామ సభలను నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదు. గుట్టుగా ఎంపిక చేసి సాయం అందించనున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అర్హులైన పేదలకు సాయం అందజేయాలి...**



గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేదవారికి సొంత ఇల్లు నిర్మించుకోవడానికి సాయం అందించాలి. రాజకీయ కోణంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తే అర్హులు లబ్ధి పొందకపోవచ్చు. గ్రామసభల్లో చర్చించి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు అందజేయాలి.

–కావలి చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షాబాద్

**అనర్హులకు అందిస్తే ఉద్యమం...**



గృహలక్ష్మి పథకం కింద అనర్హులకు సాయం అందిస్తే ఉద్యమం తప్పదు. అర్హులైన వారికే సాయం అందించాలి. పార్టీల పరంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తే ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం. అసలైన పేదలను గుర్తించి ఎంపిక చేయాలి.

–కిరణ్, బీజేపీ మండల అధ్యక్షుడు షాబాద్

## మండలకేంద్రంగా మార్చాలని వినతి



మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిలకు వినతి ప్రతం అందిస్తున్న ఆలూరు గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలో మంత్రి సబితారెడ్డి పర్యటన సందర్భంగా ఆమెకు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. గురువారం ఆలూరు గ్రామంలో బీటీరోడ్డుకు శంకుస్థాపన చేసేందుకు మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలూరును మండలకేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు మంత్రి సబితారెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకులంగా స్పందించిన మంత్రి ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి..**

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలను కోరారు. ఏళ్లతరబడిగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నవీన్‌కుమార్, శివరాజు, రమేశ్, రాఘవేందర్, మహేందర్‌రెడ్డి, సుదర్శన్, పాల్గొన్నారు.

## హడావుడిగా శిలాఫలకాలు, శంకుస్థాపన

మొయినాబాద్: ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావుడిగా రోడ్లకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు వేయిస్తున్నారని కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ ఆరోపించారు.

గురువారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనకమామిడిలో ఐదేళ్ల క్రితం శిలాఫలకాలు వేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించలేదన్నారు. రెండేళ్ల క్రితం శిలాఫలకం వేసిన చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు పూర్తి కాలేదన్నారు. ఎన్నికలకోసం ఎమ్మెల్యే కాలె యాదయ్య, మంత్రి సబితారెడ్డిని తీసుకొచ్చి రోడ్లకు శంకుస్థాపన చేయించారన్నారు. నియోజకవర్గంలోని రోడ్లు గుంతలతో అధ్వానంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు.

## ప్రతీ ఇంటికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

**బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డి

కొందుర్గు: ప్రతీ ఇంటికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించి గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి కోరారు. గురువారం కొందుర్గు మండలంలోని వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెకు బీటీరోడ్డు, ప్రతి గల్లికి సీసీ రోడ్డు వేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, రామకృష్ణ, మాసయ్యగౌడ్, సలామ్, రామచంద్రయ్య, రవి, లింగంగౌడ్, నర్సింలు, భీమయ్య, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిక..**

వీరన్నపేట గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరినట్లు మండల కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బంగారు రాములు, బాబురావు, రామచంద్రయ్య, గోపాల్, యాదయ్య పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేసీఆర్

**బీజేపీ సీనియర్ నాయకుడు ఆచారి**



మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ప్రచారం చేస్తున్న ఆచారి తదితరులు

కడ్తాల్: కేంద్రం ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను, గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించేందుకే మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు టి. ఆచారి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పల్లెపల్లెన బీజేపీ– ఇంటి ఇంటికి ఆచారి కార్యక్రమాన్ని గురువారం మండలంలోని రావిచేడ్, మద్దెలకుంట తండాలో నిర్వహించారు. ప్రధానమంత్రి బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కేంద్రం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు భగీరథ్, రాములు, రాంచందర్, వెంకటయ్య, సాయిలాల్, శ్రీశైలం, మహేశ్, రాందాస్ నాయక్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుట్ర

**పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్**



షాద్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్: మతాల మధ్య చిచ్చుపెడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో పాదయాత్ర ముగిసి ఏడాది సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజలను ఏకం చేసేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారన్నారు. వాటి పరిష్కారానికి కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఈ యాత్ర ప్రజల్లో, పార్టీ నేతల్లో కొత్త ఊపును తీసుకొచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, కొంక్లచెన్నయ్య, రఘు, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఎర్రోళ్ల జగన్, సుదర్శన్, జంగ నర్సింహ్మ, రాజు, శ్రీధర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, ముబారక్, సయ్యద్ ఖదీర్, భాస్కర్, సత్తయ్య, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ**

చేవెళ్ల: కాంగ్రెస్ పేదల పక్షమని, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి గౌరిసతీశ్‌లు అన్నారు. గురువారం పీసీసీ పిలుపు మేరకు రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా చేవెళ్ల మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తానుంచి అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ అడుగులు దేశంలో అందరిని ఏకం చేసిందని చెప్పారు. అందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల్లో గుబులు మొదలైందన్నారు. పేద ప్రజలకు భరోసా నిచ్చే విదంగా కాంగ్రెస్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాలుగా దేశంలో, రాష్ట్రంలో ఈ పార్టీలు ప్రజలను మోసం చేసి అవినీతీ అక్రమాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్ర భయంతో కేంద్రం వంటగ్యాస్ ధరను తగ్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, షాబాద్ దర్శన్, పామెన బీంభరత్, ఆంజనేయులు, పెంటారెడ్డి, పీసీసీ నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, మైనార్టీ నాయకుడు వాజీద్, పీఏసీఎస్ చైర్మన్‌లు గోనేప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, బుచ్చిరెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, మండలపార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతీ ఇంటికి తాగునీరు

తుర్కయంజాల్: వార్డు పరిధిలోని ప్రతీ ఇంటికి తాగునీరు అందజేస్తామని 18వ వార్డు కౌన్సిలర్ సునీల్ తెలిపారు. గురువారం అన్నపూర్ణ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు కౌన్సిలర్‌ను ఘనంగా సన్మానించారు.

## కస్తూరినగర్‌లో ‘మేరీ మిట్టీ– మేరా దేశ్’



అమృత కలశంతో మట్టిని సేకరిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: బీజేపీ చేపట్టిన మేరా మిట్టీ– మేరా దేశ్ ప్రచారోద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశరాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మించేందుకు అవసరమైన మట్టిని సేకరించేందుకు ప్రధాని మోదీ పిలుపు మేరకు గడపగడపకూ బీజేపీ శ్రేణులు తిరుగుతున్నాయని ఆయన అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కస్తూరినగర్ కాలనీలో అమృత కలశ్ యాత్రను రంగారెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా గడగడపకూ వెళ్లి అమృత కలశంతో మట్టిని సేకరించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, శాంతిమిత్ర, రాజవర్ధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్,శశిధర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, జీవన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మల్లేష్‌యాదవ్, రాఘవ, గోవర్ధన్ పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతుకు చర్యలు: లచ్చిరెడ్డి



ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ కాలనీలోని రోడ్లు వర్షాలకు గుంతలమయంగా మారిందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టి తీసుకెళ్లారు. దీంతో గురువారం కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్ రెడ్డి, సురేష్‌బాబు, విష్ణువర్ధన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

## గట్టుఇప్పలపల్లిలో పుట్టడమే నేరమా?

**జేఏసీ నాయకుడు రేణురెడ్డి**



గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలు గురువారానికి 67వ రోజుకు చేరుకున్నాయి. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో జేఏసీ నాయకులు సందిగ్ధంలో పడ్డారు. గట్టుఇప్పలపల్లిలో పుట్టడమే నేరమా అని జేఏసీ నాయకుడు రేణురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలముగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో దామోదర్, ఈదమయ్య, నాగయ్య, వెంకటయ్య, రాధాకృష్ణ, తేజ, పరశురాములు, బుచ్చయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



కాకతీయ పాఠశాలలో చిన్నారులు



కేశంపేట: రాధాకృష్ణుని వేషధారణలో విద్యార్థులు

షాబాద్: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గురువారం షాబాద్‌లో ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషాధారణలో ఆకట్టుకున్నారు.

**కేశంపేటలో..**

కేశంపేట: కొత్తపేట గ్రామంలోని ఆర్‌వి కాన్సెప్ట్ స్కూల్లో వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషాధారణలో ఆకట్టుకున్నారు. ఉట్లను కొట్టి సంబరాలు చేసుకున్నారు.

**కొందుర్గులో..**

కొందుర్గు: శ్రీలక్ష్మినరసింహ్మస్వామి దేవాలయ ఆవరణలో వేడుకలను నిర్వహించారు. చిన్నారులను గోపిక, కృష్ణుల వేషాధారణలో తయారు చేశారు. అనంతరం ఉట్టి కొట్టి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయ చైర్మన్ గోపాల్ ప్రారంభించారు. వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, పూజారి రాజేశ్వరస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌లో..**

షాద్‌నగర్: పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్లో బాల గోకుల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వంశీకృష్ణ, చెట్ల వెంకటేశ్, శ్రీకాకతీయ పాఠశాలల ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి పాల్గొన్నారు.



కొందుర్గులో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులు, గ్రామస్తులు



షాబాద్‌లో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు